క్లుప్తంగా

అరుణాచలేశ్వరునికి పూజలు

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లిలో ఉన్న అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారికి సోమవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పండితులు స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, అర్చనలు చేశారు.

అక్రమాలపై ఫిర్యాదు

ప్రత్తిపాడు: గోకులం షెడ్ల నిర్మాణం కోసం లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయంటూ మండలంలోని చినశంకర్లపూడి గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఏపూరి శ్రీను జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారుల చేతివాటంతో అర్హులైన రైతులను పక్కన పెట్టి, అధికార పార్టీ నాయకులకు అనుకులంగా అనర్హులకు కొమ్ము కాస్తూ నిబంధనలకు పాతరేస్తున్నారని ఆరోపించారు. చినశంకర్లపూడి గ్రామంలో గోకులం షెడ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో పశుసంపద ఉన్నవారిని పక్కన పెట్టి అనర్హులను ఎంపిక చేశారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కాలనీ ఇంటి పునాదిపై గోశాల నిర్మించినట్టు తెలుస్తున్నప్పటికీ అధికారులు నిధులు కూడా మంజూరు చేశారన్నారు. చినశంకర్లపూడి గ్రామ గోశాల షెడ్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలపై జిల్లా కలెక్టర్‌తో పాటు విజిలెన్స్, రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ విషయమై మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ కుమారస్వామిని వివరణ కోరగా.. మిరియాల శ్రీనుకు గోకులం షెడ్డు నిర్మాణానికై రూ.6,000 మాత్రమే వేతనాల రూపంలో చెల్లించామన్నారు. అర్హులైన వారందరికీ రెండో విడతలో మంజూరు చేస్తామన్నారు.

నీటి విడుదలకు సన్నాహం

కోటనందూరు: ఆగస్టు 10 నుంచి 15వ తేదీలోపు ఆయకట్టు అవసరాలకు తాండవ నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు డీఈఈ పి.అనురాధ తెలిపారు. నాతవరం సెక్షన్ కార్యాలయంలో ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యన్నారాయణ అధ్యక్షతన నీటి విడుదలపై ఆయకట్టు రైతులు, ప్రజాప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వలు, నీటి విడుదల సాధ్యాసాధ్యాలను డీఈఈ వివరించి, అనంతరం రైతులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు కోరారు. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలో వర్షాలు అంతంత మాత్రంగానే ఉన్నందున వీలైనంతా తొందరగా నీటిని విడుదల చేస్తే రైతులకు మంచి జరుగుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ, ఇంజినీర్లతో చర్చించిన అనంతరం ఆగస్టు 15లోగా నీటిని విడుదల చేసేందుకు నిర్ణయించినట్లు డీఈఈ వివరించారు. ఈ కార్యక్రమంలో జేఈఈలు శ్యామకుమార్, దుర్గాప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెస్ పోటీలు

గండేపల్లి: జ్ఞాపక శక్తికి చెస్ టకీ దోహదం చేస్తుందని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవి శంకర్ అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల విద్యార్థులకు సోమవారం చెస్ గేమ్ (చదరంగం) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోజులో కొంత సమయం చెస్ ఆడటం వల్ల జ్ఞాపక శక్తి, మానసిక విజ్ఞానం, దూర దృష్టి, ఏకాగ్రత, ఆలోచన సామర్థ్యం పెరుగుతుందన్నారు. చెస్ అనేది పురాతనమైన క్రీడగా పేర్కొన్నారు. విజేతలకు సర్టిఫికెట్స్‌తోపాటు, మెడల్స్ అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ సాయి ప్రియాంక, ఫిజికల్ డైరెక్టర్ కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మెరుగైన విద్య

కోటనందూరు: దివ్యాంగ చిన్నారులకు మెరుగైన విద్యను అందించాలని జిల్లా ఐఈ కో–ఆర్డినేటర్ జీసీడీఓ ఉమామహేశ్వరి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక భవిత కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిత కేంద్రం పరిసరాలు, రికార్డులను పరిశీలించిన అనంతరం ఆమె చిన్నారులతో మాట్లాడారు. పిల్లల పరిస్థితులు, అందిస్తున్న విద్యపై సిబ్బందిని ఆరా తీశారు. కేంద్రం అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు.

సేవలు ప్రశంసనీయం

తుని: వాకర్స్ క్లబ్ ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఆ సంస్థ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి అన్నారు. సోమవారం స్థానిక వాకర్స్ క్లబ్‌ను ఆమె సందర్శించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో తుని వాకర్స్, హెల్త్ క్లబ్ గౌరవాధ్యక్షుడు కలిదిండి సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ధన్యంరాజు, సత్యసాయి కుటుంబసభ్యులు సమకూర్చిన 50 జతల యూనిఫాంలు ప్రభావతి విద్యార్థినులకు అందజేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సప్పా నాగేశ్వరరావు, బండి శ్రీనివాసు, తోలేటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రైలు ఢీకొని మేకల కాపరి మృతి

తుని: రైలు ఢీకొని మేకల కాపరి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తుని రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న గుల్లిపాడు రైల్వేస్టేషన్ వద్ద పాయకరావుపేట మండలం సీతారామపురానికి చెందిన పక్కుర్తి చినమాధవరావు మేకలు కాస్తున్నాడు. ఈ క్రమంలో పట్టాలపైకి మేకలను బెదిరించేందుకు వెళ్లిన మాధవరావును రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇదేం రుబాబు

- ఆసుపత్రిలో పచ్చ నేతల ఒత్తిళ్లు
- ఇబ్బంది పడుతున్న వైద్యులు

ఏలేశ్వరం: అధికారం మాదే.. హడావుడీ మాదే అన్నట్టు ఉంది పచ్చ నేతల పరిస్థితి. తాము చెప్పిందే వేదం.. తమకెవరూ లేరు అడ్డం అన్న రీతిలో వారు సాగుతున్న తీరు రోగులను ఇబ్బంది పెట్టేట్టు తయారైంది. ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి కేంద్రంగా టీడీపీ నేతలు సాగిస్తున్న పెత్తనంతో వైద్యులు కూడా హడలిపోతున్నారు. వీరి రు'బాబు' చూసి బదిలీలు చేయించుకుని వెళ్లిపోతున్నారు. ఈ మధ్య కాలంలో ఇక్కడ జరుగుతున్న హడావుడి హాట్ టాపిక్ అయ్యింది. టీడీపీ కార్యాలయం పక్కనే ఉండడంతో అక్కడి నుంచి నాలుగు అడుగులు వేసి ఇక్కడకు వస్తున్న నేతలు తాము చెప్పినట్టే ముందుకు వెళ్లాలని ఆదేశాలు ఇస్తుండడం సిబ్బందికి ఇబ్బంది అవుతోంది. ఆసుపత్రిని దైవంగా భావించే వైద్యులు అక్కడికి రావాలంటే హడలిపోయే పరిస్థితిని స్థానిక టీడీపీ నాయకులు కల్పించారు.

ప్రశ్నార్థకంగా ఆసుపత్రి మనుగడ..

ప్రతి పేదవాడికి ఉచితంగా వైద్యం అందించాలని గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన నాడు– నేడు పనులతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు ఉండేవారు. దీంతో కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వాసుపత్రిని ఉండేది. ప్రతీ రోజూ వందలాది రోగులకు వైద్యం అందేది. ప్రస్తుతం టీడీపీ నాయకుల వేధింపులతో ఆసుపత్రి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఆసుపత్రి అభివృద్ధి

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ ఆసుపత్రి మండలంలోని 12 గ్రామాలతో పాటు, ఒక నగర పంచాయతీకి సుమారు లక్షకుపైగా జనాభాకు వైద్యసేవలు అందిస్తోంది. ఏజెన్సీ ముఖద్వారం కావడంతో అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల ప్రజలకు ఎమర్జెన్సీ సేవలు అందిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3 కోట్లతో నూతన భవనాలు, వాటికి రోడ్డును నిర్మించింది. గతంలో ఉండే 30 పడకల ఆసుపత్రిని గత ప్రభుత్వం 50 పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచింది. పూర్తిస్థాయిలో 11 మంది వైద్యులు సేవలు అందించేవారు. సేవలతో పాటు మందులు అందుబాటులో ఉండేవి.

వైద్యులపై వేధింపులు

గత ప్రభుత్వంలో ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో 11 మంది వైద్యులు ఉండేవారు. కూటమి ప్రభుత్వం రాగానే వైద్యులపై వేధింపులు ప్రారంభమయ్యాయి. వీటిని భరించలేక నలుగురు వైద్యులు బదిలీపై వెళ్లిపోగా.. గైన కాలజిస్ట్, ఆర్థోపెడిక్ వైద్యులు సెలవుపై వెళ్లిపోయారు. మిగిలిన ఐదుగురు బదిలీపై వెళ్లిపోయేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో ఆసుపత్రిలో వైద్యసేవల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. టీడీపీ కార్యాలయం ఆసుపత్రి సమీపంలో ఉండటంతో ఆసుపత్రికి వెళ్లి తమవారికే ప్రాధాన్యం ఇచ్చి వైద్యం చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఏలేశ్వరంలో ప్రభుత్వాసుపత్రి

వైద్యులపై వేధింపులు సరికాదు



విధులు నిర్వహిస్తున్న వైద్యులపై వేధింపులు సరికాదు. వేధింపులు తాళలేక ఇప్పటికే వైద్యులు బదిలీపై వెళ్లిపోయారు. మిగిలిన వారు ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో రోగులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. వైద్య సేవలు అందుబాటులో లేకపోతే పేదలకు ఆర్థిక కష్టాలు తప్పవు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– జువ్విన వీర్రాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ సభ్యుడు, ఏలేశ్వరం

రక్తంపై ఆంక్షలు

ఆసుపత్రిలో నిల్వ ఉంచిన రక్తం రోగి అవసరాన్ని బట్టి వైద్యులు అందిస్తుంటారు. ఇటీవల కొత్తగా ఏర్పడిన అభివృద్ధి కమిటీ సభ్యులు తమకు చెప్పకుండా, అనుమతి తీసుకోకుండా రక్తం రోగులకు ఇవ్వవద్దని వైద్యులను ఆదేశించినట్టు సమాచారం. ఈ వ్యవహారం వైద్యులకు ఇబ్బందికరంగా మారింది. రోగికి అత్యవసరంగా రక్తం ఇవ్వాల్సి వస్తే నాయకుల అనుమతి తీసుకొని ఇచ్చేలోపు రోగి పరిస్థితి ఎలా ఉంటుందోనని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి ఎమ్మెల్యే చైర్మన్‌గా వ్యవహరిస్తుంటారు. దీనికి సభ్యులు మాత్రమే ఉంటారు. అలాంటిది సభ్యులే చైర్మన్‌గా చెప్పుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో శానిటేషన్ విభాగంలో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వ్యక్తి తమపై పెత్తనం చెలాయిస్తున్నాడని సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో జరిగే ప్రతి విషయాన్ని ఆ వ్యక్తి టీడీపీ నాయకులకు చేరవేయడంతో వారు తమపై ఇష్టమొచ్చినట్లుగా రెచ్చిపోతున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇప్పటికైనా స్పందించి ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు


వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న రాజా

తుని రూరల్: మండలంలోని డి.పోలవరం, తాళ్లూరు గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. సోమవారం మండలంలోని గెడ్లబీడు సాయి వేదికలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో వివిధ పార్టీల నుంచి చేరిన కాళ్ల రాజేష్, కొరుప్రోలు నాగేశ్వరరావు, తేడ్లపు ప్రసాద్ తదితర కార్యకర్తలకు కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని, 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యనమల కృష్ణుడు, చింతల వెంకటరమణ, చిటికెల వరహాల బాబు, అంకంరెడ్డి దొరబాబు, తమరాన శ్రీను పాల్గొన్నారు.

ముద్రగడ త్వరగా కోలుకోవాలని పూజలు


సి.రాయవరంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఏలేశ్వరం: వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని సి.రాయవరం గ్రామంలో సోమవారం పార్టీ నాయకుడు గుమ్ములూరి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, పార్టీ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పూర్తి ఆరోగ్యంతో ఉండాలని ఈ పూజలు చేశామన్నారు. నీతి నిజాయితీలకు మారు పేరుగా నిలిచిన ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలన్నారు. ముద్రగడ తనయుడు, పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గిరిబాబుకు పార్టీ శ్రేణులంతా అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పలివెల రాంబాబు, తొట్టిపూడి కృష్ణ, బొట్టా అప్పారావు, దేవర రాజు పాల్గొన్నారు.

చంద్రబాబువన్నీ బూటకపు హామీలే



బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజా


కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

తుని రూరల్: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు గ్రామస్థాయిలోనూ బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. సోమవారం తుని శివారు సాయివేదికలో మండల కార్యకర్తల విస్తృతస్థాయి (బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ) సమావేశం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్‌తోపాటు ఇచ్చిన 143 హామీల మోసాల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత పార్టీ తీసుకుందన్నారు. ఇందులో భాగంగా జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించామన్నారు. మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు గ్రామస్థాయిలోనూ బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వం అమలు చేసిన పథకాల ద్వారా ప్రజలకు ఎంత మేలు జరిగింది, బాబు మోసాలతో ఎంత మేరకు నష్టపోయారో ప్రజలకు వివరిస్తామన్నారు. బూటకపు హామీలు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అమ్మ ఒడిని తల్లికి వందనంగా మార్పు చేయడాన్ని, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి, రైతు భరోసా తదితర హామీల కరపత్రాలను పంపిణీ చేస్తామన్నారు. చంద్రబాబు మాట ఇస్తే తప్పుతాడని అందరికీ తెలుసన్నారు. హామీలు అమలు చేయకపోతే ప్రశ్నిస్తానన్న పవన్ కల్యాణ్ మాటలకు ప్రజలు ఓట్లేసి గెలిపించారన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు కార్యకర్తలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నాలుగు సార్లు సీఎం అయిన చంద్రబాబు మూడు సార్లు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఈ మూడు సార్లు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తున్నారన్నారు. హామీలు అమలు చేయాలని నిలదీస్తే తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా నాయకులు, కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తప్పుడు కేసులు పెడితే పార్టీ అండగా ఉంటుందన్నారు.

మెజార్టీ మనదే..

నిజాన్ని నమ్మబలికేలోగా అబద్ధం రాజ్యమేలుతుందని వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు అన్నారు. అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశారన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీవైపే ఉన్నారన్నారు. గ్రామాల్లో నాయకులుగా ఎదగాలంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. మెజార్టీ స్థానాల్లో మనమే విజయం సాధిస్తామన్నారు. అందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. చంద్రబాబు మోసాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. వివిధ విభాగాల నాయకులు పోతల రమణ, డొంక వెంకట బెనర్జి, రాయి మేరీ అవినాష్, సకురు నాగేంద్ర నెహ్రూ, కీర్తి బాలకృష్ణ, లంక కృపానందం, చింతల వెంకటరమణ, చిటికెల వరహాలబాబు, తమరాన శ్రీను, నాగం దొరబాబు, తదితరులు మాట్లాడారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి

తుని: అన్ని వర్గాల పేదల భూసమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ కేంద్ర కార్యవర్గ సభ్యుడు కే.జనార్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ, మండలంలోని ఎన్ఎస్ వెంకటాపురం, డి.పోలవరం, మరువాడ, రేఖవానిపాలెం గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను సాగు చేసుకునేవారికి ఇవ్వాలన్నారు. కుమ్మరిలోవలో దళితులు సాగు చేసుకుంటున్న భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పోతులూరు సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరు సర్పంచ్ బొండు రాంబాబు చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ నెల 7న సర్పంచ్ రాంబాబు చెక్ పవర్‌ను రద్దు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో న్యాయపోరాటం చేశారు. న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు వాదనల అనంతరం కీలక తీర్పునిచ్చారు. చెక్ పవర్ రద్దు చేసిన అధికారుల తీరు పట్ల ఆయన అసహనాన్ని వ్యక్తం చేశారు. చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ తీర్పునిచ్చారు. సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ, దళితుడినైన తనపై రాజకీయ కక్ష సాధింపులో భాగం చెక్ పవర్‌ను రద్దు చేశారని ఆవేదన చెందారు. హైకోర్టు తీర్పుతో తనకు పూర్తి న్యాయం జరిగిందన్నారు. బలహీన వర్గానికి చెందిన ఆయనకు న్యాయం జరగడంతో సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజల మాటకు కట్టుబడి లొంగలేదు


జగ్గంపేట పార్టీ కార్యాలయంలో తోట నరసింహం

జగ్గంపేట: నియోజకవర్గంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేసిన ఒక్క పథకాన్ని కూడా చెప్పుకోలేకపోయారని, పుస్తకాలు చూపించడం గొప్పకాదని మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి తోటనరసింహం అన్నారు. జగ్గంపేటలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి అంతా మీకేంటి– మాకేంటి అన్న పద్ధతిలో ఉంటుందని ఎద్దేవా చేశారు. జగ్గంపేటలో నిర్మించిన హైవే బ్రిడ్జిని ఎందుకు అడ్డుకోలేకపోయారో ప్రజలందరికీ తెలుసన్నారు. దీని వల్ల జగ్గంపేటకు గుర్తింపు లేకుండా పోయిందని, ప్రజలు నేటికి ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. గండేపల్లి వద్ద హైవేపై ఇలాంటి బ్రిడ్జి నిర్మిస్తుంటే ఎమ్మెల్యేగా లేనప్పుడు, ఎమ్మెల్యే అయిన తర్వాత కూడా ఎంతో పోరాటం చేసి నిలుపుదల చేశానని గుర్తుచేశారు. దీని కోసం హైవేలకు చెందిన ఎంతో మంది ఉన్నతాధికారులు తనని ఒప్పించాలని ప్రయత్నం చేశారన్నారు. తాను గండేపల్లి ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి లొంగలేదన్నారు. అపరభగీరథుడుగా మీరు చెప్పుకోవడం, మీ కూడా ఉండే నేతలు తాళం వేయడం తప్పితే ఏ సాగునీటి పథకాన్ని పూర్తిస్థాయిలో తీసుకొచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. మీరు గొప్పగా చెప్పుకుంటున్న చాగల్నాడు ఎత్తిపోతల పథకానికి కరెంటు బిల్లులు రైతు ఒక్కంటికి రూ.2,950 చొప్పున మొత్తం రూ.2.15 కోట్ల కరెంట్ బిల్లు రైతులపై భారం పడితే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి రోశయ్యల దృష్టికి తీసుకెళ్లి రద్దు చేయించానని చెప్పారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతులకు వ్యవసాయ బోర్లకు ఉచిత విద్యుత్ అందిస్తే, చాగల్నాడు ఎత్తిపోతల పథకం కూడా రైతుల నిర్వహణలోనే ఉందని నచ్చచెప్పి దానికి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించానని గర్వంగా చెప్పుకుంటున్నానన్నారు. గతంలోని టీడీపీ హయాంలో ఇర్రిపాక పరిసర గ్రామాలకు సాగునీరు అందించే సోమవరం ఎత్తిపోతల పథకాన్ని మాయం చేస్తే, దాన్ని మళ్లీ ప్రభుత్వంతో పోరాడి నిధులు మంజూరు చేయించి వినియోగంలోకి తెచ్చామని తోట వివరించారు. మీరు అధికారంలో ఉన్నారు కాబట్టి మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని మీ సత్తా చూపించి పూర్తి చేయించాలన్నారు. రాజపాలెం, రామవరం రోడ్డును జ్యోతుల ఇంటిపేరుతో ఉన్న నేతలు పూర్తి చేయకుండా కుయుక్తులు పన్నుతున్నారని తెలిపారు. ఎందుకంటే అది తన స్వగ్రామం వీరవరం వెళ్లేదారని, దీని వల్ల మీకు ఓట్లు వేసిన అనేక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్న సంగతి గుర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నేతలు రామకుర్తి జగాల్, కరుటూరి శ్రీనివాస్, తోట అయ్యన్న పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్ష భగ్నం


శంఖవరంలో మాట్లాడుతున్న మేకల కృష్ణ

శంఖవరం: అధిక లోడులతో రాకపోకలు చేసే టిప్పర్ల వల్ల రోడ్లు ధ్వంసమతున్నాయని, ఆ టిప్పర్లను ఆపాలని రిలే నిరాహార దీక్షకు సమాయత్తం అవుతున్న సామాజిక కార్యకర్త మేకల కృష్ణను ముందుగానే పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం శంఖవరంలోని ఆయన స్వగృహంలో అన్నవరం ఎస్సై జి.హరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు కృష్ణను అదుపులోకి తీసుకుని అన్నవరం పీఎస్‌కు తరలించారు. దీంతో కుటుంబసభ్యులు భార్య, కుమారుడు దీక్షను కొనసాగించారు. వారికి స్థానిక ఎంపీపీ పర్వత రాజుబాబు మద్దతు తెలిపారు. ఈ దీక్ష వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, దీక్ష చేసేందుకు వీల్లేదని పోలీసులు తెలిపారు. కృష్ణకు ఎస్సై పలు నిబంధనలతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో తన స్వగ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ, ఈ సమస్య తనది మాత్రమే కాదని, ప్రజలదన్నారు. ప్రస్తుతానికి రిలే నిరాహార దీక్ష వాయిదా వేశామన్నారు. ఈ టిప్పర్ల రాకపోకల కారణంగా విద్యార్థులు, ప్రయాణికులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను హైకోర్టు వరకు తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ లిబరేషన్ ర్యాలీ


ప్రత్తిపాడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రత్తిపాడు: మండలంలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐఎంఎల్ లిబరేషన్ అనుబంధ సంస్థల కార్యకర్తలు సోమవారం ప్రత్తిపాడులో భారీ ఎత్తున ఆందోళన చేశారు. స్థానిక లిబరేషన్ కార్యాలయం వద్ద ర్యాలీని లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బుగత బంగార్రాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ ప్రభుత్వం భారత దేశ సహజ వనరులను, దేశ ప్రజల రాజ్యాంగ బద్ధ హక్కులు, చట్టాలను ప్రముఖ వ్యాపారవేత్తల వంటి కార్పొరేట్లకు తాకట్టు పెట్టారని ఆరోపించారు. మోదీ విధానాలను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని దుయ్యబట్టారు. చింతలూరు, పెదశంకర్లపూడి, లంపకలోవ, పాండవులపాలెం, పొదురుపాక, వెంకటనగరం, ఉద్దండ జగన్నాధపురం గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలు, సాగులో ఉన్న భూములకు హక్కులు, ఉపాధి హామీ పథకం కార్మికులకు రోజుకు రూ.600 వేతనం, 200 రోజుల పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు అందజేశారు. కార్యక్రమంలో లిబరేషన్ జిల్లా కార్యదర్శి అర్జునరావు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింహాచలం, ఏఐసీసీటీయూ రాష్ట్ర నాయకుడు గొడుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లు రద్దు చేయాలని ఆందోళన

జగ్గంపేట: గర్భిణులు, బాలింతలకు పోషణ ఆహారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను తక్షణం రద్దు చేయాలని జగ్గంపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమకు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ, ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్ తీసుకొచ్చి లబ్ధిదారులను అంగన్‌వాడీ సెంటర్లకు దూరం చేస్తున్నారని విమర్శించారు. మొబైల్ ఫోన్లు యాప్‌లకు అనుగుణంగా పనిచేయక అంగన్వాడీలు, లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం వీటిని రద్దు చేయాలని, గతంలో ఇచ్చినట్లే అంగన్‌వాడీ సెంటర్లకు సరకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అంగన్వాడీల అధ్యక్షురాలు సీహెచ్.రత్నం, కార్యదర్శి పి.సుజాత, కోశాధికారి వైవీ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలి

తుని: ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని అంగన్వాడీల సంఘ అధ్యక్షురాలు ధనలక్ష్మి, కార్యదర్శి మేరీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అంగన్వాడీలు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వద్ద నిరసన తెలిపారు. అనేక యాప్‌లతో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణను అస్తవ్యస్తంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనవసరమైన యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్‌ను ఉంచాలని విజ్ఞప్తి చేశారు. పిల్లలకు అందించే సరకులు అన్నీ ఒకేసారి కేంద్రాలకు చేరట్లేదన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తుని, తొండంగి, కోటనందూరు మండలాల అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ కార్యకర్తలు డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ, ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలన్నారు. ఫోన్‌ల ద్వారా అప్‌లోడు చేసే విధానాన్ని రద్దు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు బి.రత్నకుమారి, జి.బుల్లమ్మ, ఆశాజ్యోతి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆందోళన

రౌతులపూడి: మండలంలోని ఎస్సీ, ఎస్టీల రుద్రభూమి అధ్వానంగా ఉండటంతో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కొత్తెల చంటి, చామంద్ర రాంబాబు, కాకాడ అబ్బు, దారపల్లి రాంబాబు మాట్లాడుతూ, తమ ఓట్లు కావాలి కానీ తమ పాట్లు పట్టించుకోరా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీలకు 50 సెంట్లు రుద్రభూమి ఉన్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. రుద్రభూమిలో తుప్పలు, చెట్లు పెరిగిపోయాయన్నారు. పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో నాటు సారా విక్రేతలపై స్థానిక ఎక్సైజ్ సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ వివరాల ప్రకారం.. పెద్దిపాలెంలో నాటు సారా విక్రయిస్తున్న బొందల వీరకుమార్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి 90 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీదారుడికి బెల్లం విక్రయించిన కోరుప్రోలు గోపాలకృష్ణను అరెస్టు చేశామన్నారు. నిందితులు ఇద్దరినీ స్థానిక కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. మరో నిందితుడు పరారయ్యాడన్నారు. ఈ దాడిలో స్థానిక ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ పాల్గొన్నట్లు చెప్పారు.

గ్రావెల్ ట్రాక్టర్లపై కేసు నమోదు

కోటనందూరు: ఇన్సూరెన్సు లేని నాలుగు గ్రావెల్ ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.2 వేలు ఫైన్ విధించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనచోదకులకు డ్రైవింగ్ లైసెన్సుతో పాటు, ఇతర పత్రాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. అటవీ ఉత్పత్తుల అక్రమాలపై గట్టి నిఘా ఉంచామన్నారు. రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.